క్లుప్తంగా

ఉత్సాహంగా పెన్షన్ల అందజేత



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలంలస్తున్న 38 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో బుధవారం తెల్లవారుజామున నుంచే వలంటీర్లు పెన్షన్లు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 7 గంటలకు 70 శాతం పెన్షన్ల అందజేత పూర్తి చేయగా సాయంత్రానికి 98 శాతం సచివాలయాల వారీగా అందజేశారు. కొన్నిచోట్ల లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో పెన్షన్లను అందించలేకపోగా, గురువారం ఉదయం వారికి పెన్షన్లు అందజేయనున్నట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు పేర్కొన్నారు.

శివదుర్గాపురంలో పైప్‌లైన్ మరమ్మతులు



ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని శివదుర్గాపురంలో తాగునీటి పైపులైన్ మరమ్మతులు కార్పొరేషన్ సిబ్బంది బుధవారం చేపట్టారు. దీంతో ప్రజలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోవిందు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమిత్తం గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నగరంలోని ఎల్‌బీ నగర్, ద్వారకానగర్, ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్ ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవం



కోలాటాన్ని ప్రదర్శిస్తున్న యాపిల్ పాఠశాల విద్యార్థులు

మేడికొండూరు: పేరేచర్ల - సత్తెనపల్లి రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక విఘ్నేశ్వరపూజ, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, లక్ష్మీగణపతి హోమం, సాయి హోమం, వాస్తు హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, అభిషేకాలు, పురోహితులు వేద మంత్రోశ్చరణలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాములపాటి చంద్రయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. యాపిల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు కోలా ప్రదర్శన నిర్వహించారు. సాయిబాబా దేవాలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వైఎస్సార్ విగ్రహానికి నిప్పు పెట్టేందుకు యత్నం



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై నిప్పుపెట్టిన ఆనవాలు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నిప్పుపెట్టేందుకు ప్రయత్నించిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నిప్పుపెట్టేందుకు ప్రయత్నించారు. విగ్రహానికి వేసిన దండ మాత్రం కాలిపోయింది. దీనిపై గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణం పరిశీలన

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు పట్టాభిరామయ్య కాలనీలో ఉన్న ఎంపీపీఎస్ స్కూల్‌లో టాయిలెట్ నిర్మాణాలు నాడు- నేడు పనుల కింద అతివేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం కార్పొరేషన్ ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షల వ్యయంతో బాత్‌రూమ్‌లు, టాయిలెట్ల నిర్మాణం త్వరలో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

నియోజకవర్గ పరిశీలకుడు, ప్రభుత్వ సలహాదారు బత్తుల



మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి. పక్కన అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి కోరారు. గుంటూరులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల సమావేశం బుధవారం నిర్వహించారు. బత్తుల మాట్లాడుతూ పార్టీలో అందరూ సమానమేనని చెప్పారు. క్రమశిక్షణకు వైఎస్సార్ సీపీ మారుపేరుగా చెప్పారు. అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమం చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో వలంటీర్లతో పాటు కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సమన్వయం కోసం ఈ నెల 3,4,6,7 తేదీలలో నూతనంగా నియమితులైన గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న ఫిరంగిపురం, 4న తాడికొండ, 6న తుళ్లూరు, 7న మేడికొండూరు మండలాల్లో శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. కనుక నూతనంగా నియామకమైన గృహ సారథులు అందరినీ తప్పక హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో 4 మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నృసింహుని భీష్మ ఏకాదశి పూజలు



పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేన, ఆరాధన, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, 12 రకాల ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, తీర్థగోష్ఠి, నరసింహుని హోమం, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని బంగారు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం శాసన స్తంభం, పూలమార్కెట్ సెంటర్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుని తిరిగి పెద కోనేరు మీదుగా దేవాలయానికి చేరింది. ఆయా కూడళ్లలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా కఠినమైన చర్యలు తప్పవని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో తాడేపల్లి పీఎస్‌లో నమోదైన కేసులో బ్లేడ్ బ్యాచ్, గంజాయికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వివాదానికి మద్యం మత్తే కారణమని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం వారందరూ మద్యం పూటుగా తాగి, ఆ మత్తులో వారి మధ్య మాటలు పెరిగి ఓ యువకునిపై బీరు సీసాతో దాడి చేశారని, దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారని ఎస్పీ చెప్పారు. కేసును మరింత కూలంకుషంగా దర్యాప్తు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్ర డీజీపీ గంజాయి నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు గతంలో జారీచేశారని వివరించారు. దీంతో జిల్లాలో అక్రమ గంజాయి రవాణాను నియంత్రించడంతోపాటు అక్రమమార్కులను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందాలనే దురాశతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారికి చట్టపరమైన ఇబ్బందులు తప్పవని తెలిపారు. పోలీస్ ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలతోపాటు గంజాయి, మత్తు పదార్థాల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యం

- ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకాని తరుణ్
- కేఎల్‌యూలో ముగిసిన స్మారక ట్రోఫీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు తరుణ్

తాడేపల్లి రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ అధ్యక్షులు కాకాని తరుణ్ అన్నారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ 2023 ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత మీదే ఆధారపడి ఉందని, టెక్నాలజీలో భారత యువత దూసుకు పోతున్నారని అన్నారు. ఉపకులపతి డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 75 జట్లు, 904 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. కేఎల్‌యూ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్ విజేతల వివరాలు వెల్లడించారు. బ్యాడ్మింటన్ మహిళా విభాగం సింగిల్‌లో ప్రథమ బహుమతిని ఎం.నివేద, ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం(చెన్నై), ద్వితీయ బహుమతిని పాలడుగు కీర్తిక, తృతీయ బహుమతిని పులివర్తి విన్సీ(కేఎల్‌యూ) సాధించారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో(సింగిల్), ప్రథమ బహుమతి శబరీశ్వరం(ఎస్‌ఆర్‌ఎం), ద్వితీయ బహుమతిని టి.విశ్వనాథ్ బాలు (కేఎల్‌యూ), తృతీయ బహుమతిని సర్వేష్(ఎస్‌ఆర్‌ఎం), డబుల్స్) ప్రథమ బహుమతి సర్వేష్, డి.నిషాంత్(ఎస్‌ఆర్‌ఎం), ద్వితీయ బహుమతిని యశ్వంత్ బాలు, కుమార్ మిశ్రా అక్రిత్(కేఎల్‌యూ) కైవశం చేసుకున్నారు. వాలీబాల్.. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి సత్యభామ విశ్వవిద్యాలయం(చెన్నై), ద్వితీయ బహుమతిని కేఎల్‌యూ (ఏపీ). ఖోఖో.. మహిళల విభాగంలో ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం. పురుషుల విభాగంలో.. ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం. కబడ్డీలో.. ప్రథమ బహుమతి కేఎల్‌యూ, ద్వితీయ బహుమతి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాల(హైదరాబాద్). అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల విభాగ అధిపతి చప్పిడి హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, క్రీడల విభాగ అధిపతి డాక్టర్ కె.సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ప్రవాసాంధ్రుడు డాక్టర్ సజన్



పూర్వ విద్యార్థి డాక్టర్ సజన్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ శ్రీకావ్య

తాడేపల్లి రూరల్: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కేఎల్ వర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ సజన్ సూచించారు. 1999–2003కు బ్యాచ్ బీటెక్ విద్యార్థి కెనడాలో స్థిరపడి స్వదేశానికి వచ్చిన సందర్భంగా వర్సిటీని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సజన్ ఈసీఈ విద్యార్థులకు పలు రకాల సందేహాలను నివృత్తి చేశారు. నైపుణ్యాలను ఎలా మెరుగుపరచుకోవాలి, భవిష్యత్తులో విజయం ఎలా సాధించాలనే దానిపై శిక్షణను ఇచ్చారు. అనంతరం సజన్‌ను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీకావ్య సత్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, పరిశోధనా అభివృద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- చైల్డ్ లైన్ నోడల్ కోఆర్డినేటర్ బేబిరాణి
- తొమ్మిది మంది బాలకార్మికులకు విముక్తి
- నలుగురు వీధి బాలల గుర్తింపు



సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్న బాల కార్మికుడితో చైల్డ్‌లైన్ నోడల్ కో ఆర్డినేటర్ బేబిరాణి

మంగళగిరి: బాలలను పనుల్లో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్ లైన్ నోడల్ అధికారి బేబిరాణి హెచ్చరించారు. బుధవారం మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు చెప్పుల దుకాణాలు, కార్లు, బైక్ సర్వీసింగ్ సెంటర్లతో పాటు ఓ ఫ్యాన్సీ దుకాణంలో పని చేస్తున్న తొమ్మిది మంది బాల కార్మికులను, నలుగురు వీధి బాలలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ నోడల్ అధికారి బేబిరాణి మాట్లాడుతూ ఇటీవల మంగళగిరి నగరంలో వీధి బాలలు సంచరిస్తున్నారనే సమాచారంతో చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. బాలబాలికలను బడి మాన్పించి వెట్టి చాకిరీ చేయిస్తే అది నేరంగా పరిగణిస్తామని చెప్పారు. అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి మూర్తి, సీడీపీఓ విజయలక్ష్మి, బచ్‌పన్ బచావో రాష్ట్ర సమన్వయకర్త జి.తిరుపతిరావు, చైల్డ్ లైన్ మెంబరు ఎస్‌కే బాబు, ఏఎస్‌ఐ లక్ష్మి పాల్గొన్నారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొత్తపేట పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ బి.సీతారామయ్య, కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శీలం శ్రీనివాసులరెడ్డి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన సర్వేపల్లి అంకమ్మరావు మద్యానికి బానిసగా మారి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలు చేయటం ప్రారంభించాడు. గత నెల 31న కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అంకమ్మరావును పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించారు. దీంతో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. సుమారు 10 రోజుల వ్యవధిలో 13 బైక్‌లు దొంగిలించాడు. వాటి విలువ రూ 9లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గతంలోనూ చిలకలూరిపేట, సత్తెనపల్లి, గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో 20 బైక్‌లు చోరీ చేసిన కేసులో అరెస్ట్ అయి జైలుశిక్ష అనుభవించి వచ్చిన తరువాత కూడా అంకమ్మరావు చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మాతా కటాక్షిం‘చండీ’ !

పాత గుంటూరు: అరండల్‌పేట 4వలైనులోని హంపి విద్యారణ్య పీఠ పాలిత గంగా మీనాక్షి సోమసుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రతిష్ట జరిగి 120 సంవత్సరాలు నిండిన సందర్భంగా సహస్ర కలశాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా బుధవారం యాగబ్రహ్మ గుంటూరు కాశీ పర్యవేక్షణలో నవ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర శర్మ పర్యవేక్షించారు.

రాకెట్ నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్



పెదకాకాని హైస్కూలులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

పెదకాకాని: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల్లో బుధవారం విద్యార్థులకు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన కలిగించారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుట్టా దుర్గ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యార్ల శివప్రసాద్ మాట్లాడుతూ జీఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ రాకెట్ నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన అవసరమని సూచించారు. రాకెట్‌ను అంతరిక్షంలో ప్రవేశపెట్టడానికి కావాల్సిన శాస్త్ర సాంకేతిక విధానాలను వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానంపై అనేక సదస్సులు, వర్క్‌షాప్‌లు, టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండ్రు అజయ్‌రెడి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: పిల్లల్లో రక్తహీనత తొలగించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయని ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లు, ఉర్దూ పాఠశాల, శాంతి విద్యానికేతన్ పాఠశాలల్లో బుధవారం జిల్లా ఎన్‌సీడీసీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రావణ్‌బాబు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్న వివరాలను సంబంధిత నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన డాక్టర్ వైఎస్సార్ కిట్లు ద్వారా ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారని చెప్పారు. పిల్లలకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేస్తున్న రికార్డులు పరిశీలించి పిల్లల తల్లులు, గర్భిణులతో మాట్లాడారు. ప్రతినెలా క్రమం తప్పకుండా రెండుసార్లు గర్భిణులు, బాలింతలు బరువు, హెచ్‌బీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత తొలగుతుందని చెప్పారు. పిల్లలకు రక్తహీనత తొలగించేందుకు ఆహారంతో పాటు ఐరన్‌మాత్రలు మింగించాలని అంగన్‌వాడీలకు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ సురేఖ, పీహెచ్‌ఎన్ గాయత్రీ ఉన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో తెనాలిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఒక ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్ట్ భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వి. బాబుల నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులు సాధించడంతోపాటు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో టీటీసీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థినులు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 8న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు డెమోకు హాజరు కావాల్సి ఉంటుందని వెల్లడించారు. పోస్టుకు ఎంపికైన వారికి అవుట్ సోర్సింగ్ పద్ధతిపై జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8328159776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గీతామందిరంలో గీతాపారాయణం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పానుగుపాడులోని వేంకటేశ్వరుడి ఆలయంలో అర్చకులు రామకృష్ణమాచార్యులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఫిరంగిపురంలోని గీతా మందిరంలో స్వామివార్లకు అర్చకులు రాజేంద్రశర్మ అభిషేకాలు నిర్వహించి విష్ణు సహస్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం గీతా భజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ, గీతా పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

3, 4వ తేదీల్లో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలు



మూట్ కోర్టు బ్రోచర్ విడుదల చేస్తున్న కుప్పుస్వామి, సుధాకర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ (జేసీ లా) కళాశాల మూట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 3,4వ తేదీల్లో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని జేసీ లా కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్‌బాబు, విద్యార్థులతో కలిసి మూట్ కోర్టు పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ న్యాయ విద్యాసంస్థలకు చెందిన 32 జట్లు హాజరవుతుండగా, వీటిలో ఏపీ నుంచి ఏడు, తెలంగాణ నుంచి రెండు జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ముగింపు కార్యక్రమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎ.రామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని వివరించారు. మూట్ కోర్టు పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచే వారికి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులతో పాటు 4వ స్థానంలో నిలిచిన వారికి స్టాఫ్ ట్రోఫీ కింద రూ.10వేలు, ఐదోస్థానంలో నిలిచిన వారికి ఆటామినై ట్రోఫీ కింద రూ.10వేల ప్రోత్సాహక బహుమతులుగా ఇస్తామని తెలిపారు. కాగా ముంబై, పూణె, బెంగళూరు, గోవా, లక్నో, గుంటూరులోని విద్యాసంస్థల్లో నిర్వహించిన మూట్ కోర్టు పోటీల్లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థులు ఆరు బహుమతులను గెలుపొందినట్లు తెలిపారు. విషయ పరిజ్ఞానానికి, వాక్‌పటిమకు అభివ్యక్తి నైపుణ్యాలను జోడించడం వలన న్యాయ విద్యార్థులు తమ వృత్తిలో చక్కగా రాణించేందుకు మూట్ కోర్టు పోటీలు దోహదం చేస్తాయని వివరించారు.

ఎరువుల షాపు తనిఖీ

జంపని(వేమూరు): ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం ప్రకటించిన ధరలకే అమ్మాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్. సునీత తెలిపారు. మండలంలోని జంపనిలో బుధవారం ఆమె ఎరువుల షాపును తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వల్ని పరిశీలించారు.

● ‘సత్యదేవ’ జయతే



పాత గుంటూరు: బ్రాడీపేటలోని సిద్దేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ఓంకారేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణాల్లో చివరిగా రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం అర్చకులు బుజ్జి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ కనుల పండువగా నిర్వహించారు. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి, మంత్రపుష్పం, ఆశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఇందుమతి భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి శ్రీమద్రామాయణం విశేషాలతో ప్రవచనం చేశారు. ఆలయ పాలకమండలి సత్యవతిని సత్కరించారు. అనంతరం రమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యదర్శి నంబూరి శ్రీవేంకటనారాయణమూర్తి పర్యవేక్షించారు.